క్లుప్తంగా

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

రామాపురం : మండల కేంద్రంలోని వైఎస్సార్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగే ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రజలను కోరారు. వైద్య శిబిరంలో తిరుపతికి చెందిన శ్రీ వేంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో 18 మంది వైద్యులు హాజరై కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉచితంగా మందులు అందిస్తామన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా తిరుపతి తీసుకెళ్లి అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లను నిర్వహిస్తామన్నారు. కంటి సమస్యలు ఉన్న ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భోజన వసతిని ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

జీవన ప్రమాణాలు పెంపొందించాలి

రాయచోటి టౌన్ : విద్యార్థులలో జీవన ప్రమాణాలు పెంపొందింపజేయాలని జిల్లా నోడల్ అధికారి మేరి అన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని డైట్ కేంద్రంలో జిల్లావ్యాప్త పీఈటీ, ప్రత్యేక ఉపాధ్యాయులకు విద్యార్థుల జీవన నైపుణ్యం పెంపుపై ఇస్తున్న శిక్షణా కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో జీవన నైపుణ్యాలు పెంచి ప్రపంచ పౌరులుగా తయారు చేయాలని చెప్పారు.

వీరబల్లె తహసీల్దార్‌గా బొమ్మవరం మహేశ్వరరెడ్డి

వీరబల్లి (రాయచోటి టౌన్) : వీరబల్లె తహసీల్దార్‌గా బొమ్మవరం మహేశ్వరరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన తులసమ్మ రాజంపేట రెవెన్యూ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. వీరబల్లెకు వచ్చిన మహేశ్వరరెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖలతోపాటు భూసేకరణ శాఖలో విధులు నిర్వర్తించారని తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

పెనగలూరు : మండలంలోని ఓబిలి పంచాయతీ అబ్బిగారిపల్లె పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయుడు, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు ఎన్.గోపాలరెడ్డిని పాఠశాలలో ఘనంగా సన్మానించారు. పెనగలూరు నుంచి రాజంపేట మండలానికి బదిలీ కావడంతో ఎస్ఎఫ్‌సీ చైర్మన్, ఉపాధ్యాయులు కలిసి ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ పి నారాయణ, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు దుశ్శాలువాతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పార్వతి, మాజీ చైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మల్లికార్జున, సునీత, కె.యానాదయ్య, పి.యల్లయ్య, అశోక్ కుమార్, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతులున్న వారికే యాసిడ్ విక్రయించాలి

రాయచోటి టౌన్ : అనుమతులున్న వారికి మాత్రమే యాసిడ్ విక్రయించాలని రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, రూరల్ సీఐ లింగప్పలు యాసిడ్ వ్యాపారులకు హెచ్చరించారు. బుధవారం రాత్రి రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ యాసిడ్ ఎవరైతే కొనుగోలు చేస్తున్నారో వారి పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. యాసిడ్‌ను పిల్లలు, వృద్ధులకు అమ్మకూడదని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ పోలీసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లకు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలి

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో వంటను తయారు చేసేందుకు అవసరమైన గ్యాస్ సిలడర్‌లను వెంటనే అందజేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాయచోటి ప్రాజెక్టు కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంగన్‌వాడీలకు గ్యాస్ స్టవ్‌లు ఇచ్చి సిలెండర్లను ఇవ్వకపోతే గర్భిణులు, బాలింతలకు వంట ఎలా చేస్తారంటూ ప్రశ్నించారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27, 28న మండల కేంద్రాల్లో 31న ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బైక్, మినీ వ్యాన్ ఢీ

వ్యక్తికి స్వల్ప గాయాలు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని కోదండ రామస్వామి కల్యాణ వేదిక వద్ద ఉన్న జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓమ్నీ వ్యాన్, బైకు ఢీ కొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు పోరుమామిళ్ల మండలం కొండుగారిపల్లి గ్రామానికి చెందిన ఎం.రవి(33) ఏపీ 39 ఎస్‌డబ్ల్యూ 2770 నెంబర్ గల బైకుపై ఒంటిమిట్ట నుంచి కడప వైపు వెళుతుండగా ఒంటిమిట్ట కోదండ రామస్వామి కల్యాణ వేదిక వద్దకు రాగానే తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన వందూరు కుట్టామర్‌కు చెందిన కేఏ 05 ఎంఈ 1653 నెంబర్ గల ఓమ్నీ వ్యాన్‌ను ఢీ కొట్టింది. దీంతో రవికి చిన్నపాటి గాయాలు కాగా అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అనంతరం ప్రమాదానికి కారణమైన వాహనాలను, వ్యాన్ డ్రైవర్‌ను స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాల లబ్ధి

- ప్రతి అర్హుడు ఇంటి పట్టా పొందాలి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



సంక్షేమ బావుటాను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

సిద్దవటం : ప్రతి గడపకు సంక్షేమ పథకాల లబ్ధి అందుతోందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మండలంలోని పెద్దపల్లె పంచాయతీ మిట్టపల్లెలో బుధవారం మేడా గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులు ఇచ్చి ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారికి మంజూరైన సంక్షేమ పథకాలకు సంబంధించిన పత్రాన్ని ఆయన అందజేశారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకొని సమస్యలను పరిష్కారం చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటిపట్టా పొందేలా చూడాలని అధికారులకు తెలియజేశారు. గ్రామంలో రోడ్ల సమస్య ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా రోడ్లను వేయించడానికి కృషి చేస్తామని గ్రామస్తులకు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణాల శాఖ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు జగదీష్‌కుమార్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం మండల కన్వీనర్ పల్లె సుబ్బరామిరెడ్డి, మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, ప్రధాన కార్యదర్శులు వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, కె.వి. సుబ్బారెడ్డి, ఉప మండలాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, పెద్దపల్లె మాజీ సర్పంచ్ కె.వి. సుబ్బయ్య, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జవహర్‌బాషా, తుర్రా ప్రతాప్, నరసింహారెడ్డి, రావుల సుబ్బారెడ్డి, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, శోభన్‌రెడ్డి, రోశిరెడ్డి, ఎల్లారెడ్డి, శివరామిరెడ్డి, రాయుడు, సుబ్రమణ్యం, ఎం.సుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు వింటూ.. సంక్షేమం వివరిస్తూ..

గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సంక్షేమ వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పరిష్కార మార్గాలు చూపుతూ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన అరవీడు గ్రామ సచివాలయ పరిధిలోని గాండ్లపల్లె, మడుగువారిపల్లె, కూర్మాయగారిపల్లె, మలసానివాండ్లపల్లె, ఆంజనేయపురం, బీసీ కాలనీ, నాగిరెడ్డిగారిపల్లె, రెడ్డివారిపల్లె, ఎస్సీ కాలనీ, దిన్నెమీదపల్లె, దళితవాడ, బుక్కపట్నం వారిపల్లె, బండికిందపల్లె, గొల్లపల్లె, సింగంవారిపల్లె, మాలపల్లె, దళితవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. అనంతరం సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందించి వారికి ప్రభుత్వం నుంచి ఎంత మేర సహాయం అందిందో వివరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు, నాయకులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా అందిస్తున్న పథకాలను కేవలం అర్హతే ప్రామాణికమని, పథకాల లబ్ధిలో ఎలాంటి తారతమ్యాలకు తావు లేకుండా అందిస్తున్నామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమం అందిస్తుందన్నారు. ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాలతో ఆర్థికంగా నిలదొక్కుకున్నామని ప్రజలు ఆనందంగా చెబుతున్నారని ఆయన తెలిపారు. జగనన్న సురక్షలో ఏదైనా కారణం చేత పథకాలందని వారిని గుర్తించి పథకాలను వర్తింపజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జగనన్న పాలన, ప్రేమ, కరుణ, వాత్సల్యంతో కూడుకుంటే, చంద్రబాబు పాలన మాత్రం పగ, కక్ష, కార్పణ్యాలతో సాగేదని ప్రజలకు తెలియజేశారు. దుర్మార్గ ఆలోచనతో ఉన్న చంద్రబాబు కుట్రలకు ప్రజలు బలి కావద్దన్నారు. ప్రతి ఇంటికి మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. అనంతరం అరవీడు మంగళపల్లెలో వైఎస్సార్ సీపీ కార్యకర్త శ్రీనివాసులు మృతదేహానికి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కె.విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ యదుభూషణరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆవుల నాగభూషణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు ఖాదర్‌మొహిద్దీన్, గుమ్మా అమర్‌నాథరెడ్డి, వెంకటరెడ్డి, సర్పంచ్ రెడ్డెమ్మ, కో ఆపరేషన్ మెంబర్ నిజాంవలి, వైఎస్సార్‌సీపీ నేతలు శంకర్‌రెడ్డి, రెడ్డికుమార్, వెంకట రమణ, దుగ్గపట్నం నరసయ్య, విష్ణు, హబీబుల్లా, జాఫరుల్లా, రెడ్డిబాషా, మహమ్మద్ రఫీ, సురేష్, శివశంకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కె.రమేష్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వే

పెనగలూరు : ఓటర్ల జాబితాపై ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాలని తహసీల్దార్ శ్రీధర్ రావు అన్నారు. బుధవారం బీఎల్‌ఓ, సూపర్‌వైజర్లతో ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలకు పక్కా ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. చనిపోయిన వారి పేర్లు తొలగించి వివాహమైన వారు ఉంటే వారి పేర్లను జాబితాలో చేర్చాలన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీలోపు ఈ సర్వేను పూర్తి చేయాలని ఆయన తెలిపారు.

ఎన్‌సీసీకి విద్యార్థుల ఎంపిక

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 8వ తరగతి విద్యార్థులను ఎన్‌సీసీకి ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, ఎన్‌సీసీ అధికారి పి.రాజశేఖర్‌లు తెలియజేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు నాయక్, సుధాకర్, రాజేంద్ర చౌదరి, హవాల్దార్ కొండారెడ్డిలు హాజరై పరుగుపందెం, శారీరక దృఢత్వం వంటి పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. బాలుర విభాగంలో 33 మంది, బాలికల విభాగంలో 17 మందిని ఎంపిక చేశారు. మరికొంత మందిని రిజర్వ్‌లో ఉంచారు.

చెన్నూరు ఎంఈఓకు సత్కారం

రాజంపేట : నందలూరు మండల నాగిరెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తూ చెన్నూరు ఎంఈఓగా బదిలీ అయిన గంగిరెడ్డిని బుధవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌బాషా, ఎంఈఓలు నాగయ్య, అనంతకృష్ణ, ఉపాధ్యాయులు నాగేంద్రప్రసాద్, ఆనంద్ ఆచారి, చాన్‌బాషా, స్వర్ణలత, సుబ్బరాయుడు, జి.వెంకటరమణ, పీడీ గౌరి, కాంట్రాక్టరు ఆకేపాటి రమేష్‌రెడ్డి, కుమారస్వామిరాజు, పవిత్ర, సీఆర్పీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సేవకు సలాం



మాస్కుల నుంచి రేషన్ వరకూ..



కరోనా సమయంలో తిరుపతి రుయాలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ దీప్తి

ఈ చిత్రంలో కనిపిస్తున్నది పెనగలూరు మండలం దిగువ సిద్దవరంలో వలంటీర్‌గా సేవలందిస్తున్న బి.దీప్తి. గ్రామంలో తన పరిధిలోని కుటుంబాలకు కరోనా సమయంలో ఫీవర్ సర్వేలో కరోనా లక్షణాలున్న వారిని గుర్తించి వారికి టెస్టింగ్‌కు సహకరించారు. అందరూ దూరం పెట్టిన తనవంతు బాధ్యతగా వలంటీర్ దీప్తి దగ్గరుండి వారికి చికిత్స అందేలా చూసింది. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సాయంతోపాటు వారికి అందాల్సిన మాస్కుల నుంచి ఉచిత రేషన్ వరకు అందిస్తూ అండగా నిలిచారు. కరోనా సమయంలో తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సింగనమల లక్ష్మి తులసమ్మకు ధైర్యంగా ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందించి ఆదర్శంగా నిలిచింది. గత ప్రభుత్వంలో చిన్న పనికి కూడా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. దీంతో వాలంటీర్ దీప్తి అందిస్తున్న సేవలపై ఆయా కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

– పెనగలూరు

నడవలేని పరిస్థితిలో..



నాలుగు నెలల క్రితం మా ఇంటి సమీపంలో పడిపోయాను. వలంటీరు ప్రసన్నకుమార్ రెడ్డి, ఇతరుల సహాయంతో నన్ను తిరుపతిలోని నా కుమారుడి వద్దకు చేర్చి చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. నేను తిరుపతిలో నడవలేని పరిస్థితిలో ఉండగా పింఛన్‌ను వలంటీర్ ప్రసన్న తిరుపతికి వచ్చి అందించాడు. కష్టకాలంలో పింఛన్ సొమ్ము చాలా ఆదుకుంది. మందులు కొనుక్కుంటున్నాను. వలంటీర్ల సేవలు ఎన్నడూ మరచిపోలేను.

– గణపతిరెడ్డి పెంచలమ్మ, పి.కొత్తపల్లి, పెనగలూరు

ఆకలి తీర్చిన వలంటీర్



నాగమ్మకు కూరగాయలను అందజేస్తున్న వలంటీరు ఆకుల అరుణ

నందలూరు గ్రామంలోని బ్రహ్మణవీధిలో నివసిస్తున్న పసుపులేటి నాగమ్మ ఇంటిలోని వారందరికి ఫస్ట్ కోవిడ్‌లో పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో వారిని చుట్టుపక్కల వారు బయటికి రావద్దని హెచ్చరించారు. బయటికి వెళ్లి ఏవైనా తీసుకొని రావాలంటే సమీపవాసులు అభ్యంతరాలను వ్యక్తం చేసే పరిస్థితి. సమాచారం అందుకున్న సచివాలయం క్లస్టర్ పరిధిలో ఉన్న వలంటీరు ఆకుల అరుణ, స్థానిక పోలీసులు, వైద్యసిబ్బంది సహకారంతో వారి ఇంటి వద్దకు వెళ్లి ధైర్యం చెప్పింది. కోవిడ్ నివారణ చర్యలను వివరించింది. దాతల సహకారంతో కూరగాయలు, నిత్యావసరకులను నాగమ్మ ఇంటికి చేరవేయడంతో వారి ఆకలి తీరింది. మనుష్యులను దూరం చేసిన కోవిడ్‌ను వలంటీర్ అండగా నిలిచి వారికి కావాల్సిన సహాయాన్ని అందించి ఆదర్శంగా నిలవడంతో అక్కడివారు వలంటీర్ సేవలను అభినందించారు.

– రాజంపేట

అమ్మలా వలంటీర్ అరుణ సాయం



మా ఇంటిలో నా కోడలకు సభ్యులకు కరోనా సోకింది. నాకు వయస్సు ఎక్కువ నామీద ప్రభావం పడుతుందని కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. కరోనాతో ప్రాణాలు విడుస్తామేమోనన్న భయం మాలో ఉండేది. బయటకు వెళ్లలేక తినేకిలేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అప్పుడే మా వలంటీరు అరుణ వచ్చి సాయం చేసింది. నిత్యావసర సరుకులు, కూరగాయలు ఇచ్చి ఆదుకుంది. మా ఇంటి వద్ద రావాలంటే భయపడిన రోజుల అవి. ఆరోజులను ఇప్పటికీ మర్చిపోలేకున్నా. వలంటీరు తల్లిలా మా ఆకలి తీర్చింది.

–పసుపులేటి నాగమ్మ, నందలూరు(రాజంపేట)

నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి



డిజిటల్ లైబ్రరీ శంకుస్థాపనలో పాల్గొన్న ఆర్.ధనుంజయరెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల

ఓబులవారిపల్లె : నియోజకవర్గ అభివృద్ధిపై చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ముఖ్యమంత్రి సలహాదారు ఆర్.ధనుంజయరెడ్డి అన్నారు. మండలంలోని తల్లెంవారిపల్లెలో బుధవారం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు హాజరయ్యారు. రూ. 2.97 కోట్లతో నూతనంగా నిర్మించనున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలు, రూ. 17 లక్షల వ్యయంతో నిర్మించనున్న డిజిటల్ లైబ్రరీ, రూ. 1.50 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్, తాగునీటి వాటర్ ట్యాంకుల భూమి పూజ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. మారుమూల అటవీ శివారులో పాఠశాల ఏర్పాటు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి సలహాదారు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో తల్లెంవారిపల్లి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం ఆయన పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాల నిర్మిస్తున్న సందర్భంగా విద్యార్థులు థాంక్యూ సీఎం సార్ అంటూ నినదించారు. వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, పంజం సుకుమార్ రెడ్డి, ఎంపీపీ ముద్దా వెంకట సుబ్బారెడ్డి, సుధాకర్ రాజు, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, ఓజీ శ్రీనివాసులు రెడ్డి, రామకృష్ణయ్య, సర్పంచ్‌లు ఎస్పీ జయపాల్ రెడ్డి, కృష్ణయ్య, జెడ్పీటీసీ నరసింహులు, దుర్గా ప్రసాద్, ఎంఈఓ రెడ్డయ్య, అన్నమయ్య జిల్లా ఈఈ మురళీధర్, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ విజయరావు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఓర్వలేకే టీడీపీ నేతల ఆరోపణలు



మాట్లాడుతున్న ఎంపీపీ నాగశ్రీలక్ష్మి

సంబేపల్లె : మండలాన్ని అభివృద్ధిలో పథంలో నడిపించడంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేస్తున్న కృషిని ఓర్వలేక టీడీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారని ఎంపీపీ నాగశ్రీలక్ష్మి తెలిపారు. మండలాభివృద్ధిపై టీడీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారంపై ఎంపీపీ స్పందిస్తూ రూ.32.28 కోట్లతో మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్లు, సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లీనిక్‌లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రైతాంగానికి ఉచిత బోర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను త్వరితగతిన అందజేశామని తెలియజేశారు. నాడు–నేడు కింద పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సదుపాయాలను కల్పించామన్నారు. ఒక్క దేవాలయాల అభివృద్ధికే రూ.7.48కోట్లు తీసుకొచ్చిన ఘనత శ్రీకాంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ధి చేసిన ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. అభివృద్ధిలో ఎమ్మెల్యే నిబద్ధత ప్రశ్నించే అర్హత ప్రతిపక్షానికి లేదని గుర్తు చేశారు. సంబేపల్లెలో ఇంత అభివృద్ధి జరుగుతున్న ఆరోపణలు చేస్తున్న నాయకులను విమర్శించి తమ స్థాయిని దిగజార్చుకోవడం ఇష్టం లేదని పేర్కొన్నారు. ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరంరెడ్డి, జెడ్పీటీసీ కవిత, ఉపేంద్రనాథరెడ్డి, వీపీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక ‘జగనన్న సురక్ష’



రాజంపేట టౌన్: సర్టిఫికెట్లు అందజేస్తున్న పోలా

రైల్వేకోడూరు : ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని తక్షణమే పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పట్టణంలోని సచివాలయం – 3లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ నవరత్న సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికి అందించడమే జగనన్న సురక్ష లక్ష్యం అన్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారు ఎవరూ ఉండకూడదనేదే జగనన్న ఆశయమన్నారు. అనంతరం మంజూరైన ధృవీకరణ పత్రాలు, రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, పట్టణ అధ్యక్షుడు సీహెచ్.రమేష్, తహసీల్దారు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : పేద ప్రజల మోములో చిరునవ్వులు నింపే సంక్షేమ పాలన ఎప్పటికి ఇలానే కొనసాగాలంటే జగన్ కలకాలం సీఎంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 19, 20, 21 సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు పోలా చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, జగనన్న సురక్ష మున్సిపాలిటీ ఇన్‌ఛార్జ్ ముని శంకరయ్య, జేసీఎస్ మున్సిపాలిటీ ఇన్‌ఛార్జ్ వడ్డే రమణ, కౌన్సిలర్లు చప్పిడి శ్వేతారెడ్డి, తోట వాణి, ప్రతాప్, సనిశెట్టి నవీన్ కుమార్, న్యామతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం ‘జగనన్న సురక్ష’

సంబేపల్లె : ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం పేదవారికి వరంగా మారిందని ఎంపీపీ నాగశ్రీలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె, మోటకట్ల గ్రామాల సచివాలయ సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి సురక్ష స్పెషల్ ఆఫీసర్ మద్దిలేటి హాజరయ్యారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు ధృవపత్రాలను అందజేశారు. అనంతరం మోటకట్లలోని నేషనల్ స్కూల్ యజమాని అశోక్ రెడ్డి గ్రామంలోని వలంటీర్ల సేవలను గుర్తించి ఒక్కో వలంటీర్‌కు రూ.2500 నగదును అందజేశారు. వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరంరెడ్డి, సర్పంచ్‌లు అలివేలమ్మ, మోహన్, ఎంపీటీసీ రాజ్‌కుమారి, వడ్డి వెంకటరమణారెడ్డి, నాయకులు రిటైర్డ్ ఏఎస్పీ వెంకటనాథరెడ్డి, వాసుదేవరెడ్డి, అమరనాథరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, తహసీల్దార్ మహేశ్వరీభాయ్, ఎంపీడీఓ నరసింహులు పాల్గొన్నారు.

కట్టావారిపల్లెలో పశువైద్య శిబిరం

పెనగలూరు : మండలంలోని కట్టావారిపల్లెలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులు, గొర్రెలు, మేకలు ఉన్న రైతులతో వారు ప్రత్యేకంగా సమావేశమైన వాటికి వచ్చే వ్యాధులపై వివరించారు. అలాగే రూ. 52 వేలు విలువజేసే మందులను ఆక్సస్ వెట్ కడప వారి ద్వారా ఉచితంగా పంపిణీ చేశారు. డిప్యూటీ డైరెక్టర్ ప్రభాస్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు జాగ్రత్తలను తెలియజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్న పశువులకు ప్రత్యేకంగా చికిత్స చేశారు. సర్పంచ్ మోహనమ్మ, శివయ్య నాయుడు, పశువైద్యాధికారి వేదపతి, భువనేశ్వరి, తేజ తదితరులు పాల్గొన్నారు.

యువ ఉత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ

రైల్వేకోడూరు : నెహ్రూ యువ కేంద్రం రాయచోటిలో నిర్వహించిన యువ ఉత్సవ్‌లో రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్టు బుధవారం వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ రూత్ బెనర్జీ తెలిపారు. భారత ప్రభుత్వ క్రీడలు, యువజన సర్వీసుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18న జిల్లా స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించగా వైఎస్సార్ ఉద్యాన కళాశాల నుంచి కవిత్వంలో అమన్‌కుమార్ వర్మ మొదటి స్థానం సంపాదించగా, మొబైల్ ఫొటోగ్రఫీలో తియాసదాస్, వ్యాసరచన పోటీల్లో విద్యాధరి, పెయింటింగ్‌లో వెన్నెల, గ్రూప్ డ్యాన్స్‌లో మౌనిక, నిఖిత, వర్షిత, వెంకటజ్యోతి, అనన్యశ్రీ, నమితా నారాయణ్ బృందం బహుమతులు పొందినట్టు తెలియజేశారు. అలాగే కవిత్వంలో అమన్‌కుమార్ వర్మ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొందినట్టు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.రామయ్య, డాక్టర్ ఎ.నిశ్చల, డాక్టర్ టి.వి.సురేంద్రనాథ్‌రెడ్డి, వై.రవిశంకర్‌లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



సంక్షేమ బావుటాను అందజేస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు : ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సచివాలయం – 2 పరిధిలో ధర్మాపురంలో గడపగడపకు కార్యక్రమాన్ని చేపట్టారు. జోరువానను సహితం లెక్కచేయకుండా ప్రతి గడప తొక్కుతూ మీకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికి కుల, మత, వర్గ, పార్టీ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి బాగోగులను అడిగి తెలుసుకుని ప్రభుత్వం నుంచి వారికి అందుతున్న సంక్షేమాన్ని వివరించారు. మాట తప్పని, మడమ తిప్పని మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను చేసి చూపిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా మీకు అందరికీ తోడు నీడగా నిలుస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీరంతా బాసటగా నిలవాలని తెలియజేశారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకోసం సీఎం జగన్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సచివాలయ సిబ్బంది, అన్నిశాఖల అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

చిట్వేలి : ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దోచుకుంటున్నారని, అట్టి నేరాలపై అవగాహన కలిగి జాగ్రత్తగా మెలగాలని ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజంపేట డీఎస్పీ వీఎన్ఎస్ చైతన్య సైబర్ నేరాల పట్ల పలు సూచనలు చేశారన్నారు. ప్రజల అమాయకత్వం సైబర్ నేరగాళ్లకు అవకాశంగా మారిందన్నారు. బ్యాంకు ఖాతా నెంబరు, పాస్‌వర్డ్, ఓటీపీ, పిన్ కోడ్ల సమాచారాన్ని ఇతరులకు తెలియకుండా జాగ్రత్త పడాలన్నారు. ఫేక్ లోన్ యాప్‌లను నమ్మవద్దన్నారు. ఏటీఎం, క్రెడిట్ కార్డు, వివాదస్పద మెసేజ్‌లను ఇతరులకు పంపవద్దన్నారు. మోసానికి గురైనట్లు అయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

పుల్లంపేట : మండల పరిధిలోని మల్లెంవారిపల్లి గ్రామ నివాసి అయిన పొట్టపోగుల వెంకటయ్య సతీమణి నరసమ్మకు వెన్నపూస దెబ్బతింది. విషయం తెలుసుకున్న స్పందన ట్రస్టు చైర్మన్ నీరుగట్టు హరిబాబు, ట్రస్టు అడ్మిన్ దిలీప్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, గ్రామ పెద్ద రామిరెడ్డి, ట్రస్టు సభ్యులు నితీష్ కుమార్, శంకర్ శివలు వృద్ధురాలికి రూ. 20 వేల నగదు, నెలకు సరిపడా సరుకులను అందజేశారు.